
క్లుప్తంగా

కుమారస్వామికి విశేషపూజలు


పూజలందుకున్న కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అర్చకులు అభిషేకం, సుబ్రహ్మణ్య స్వామికి అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు.

రెండు మసీదుల్లో చోరీ


వివరాలు సేకరిస్తున్న సీఐ, ఎస్‌ఐ

పాములపాడు/కొత్తపల్లి: పాములపాడు మండలం ఇస్కాల, కొత్తపల్లి మండలంలోని దుద్యాల గ్రామాల్లో ఉన్న మసీదుల్లో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఇస్కాల మసీదుల్లోని హుండీని ఎత్తుకెళ్లి అందులోని రూ.10,000 ను తీసుకుని గ్రామ శివారులో హుండీని పడేసి వెళ్లారు. దుద్యాల మసీదులో గ్యాస్ సిలిండర్, ఇన్వర్టర్ బ్యాటరీ, వాక్యూమ్ క్లీనర్‌లను ఎత్తుకెళ్లారు. తెల్లవారు జామున మసీదులకు వెళ్లిన మత పెద్దలు తలుపులు పగలగొట్టి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఐలు సురేష్‌బాబు, కేశవ్ ఘటనా స్థలాలకు చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎర్రగుంట్లలో ఉచిత వైద్య శిబిరం


గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

బండిఆత్మకూరు: మండలంలోని ఎర్రగుంట్ల గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ థెరిస్సాతో పాటు పలువురు వైద్య ఆరోగ్య సిబ్బంది హాజరై ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, వేడివేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఏ మోహన్ నాయక్, గ్రామ కార్యదర్శి సుబ్బారావు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విరాళాల సేకరణ


గౌడ్ సెంటర్‌లో విరాళాలు సేకరిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

ఆత్మకూరు: విజయవాడ వరద బాధితుల సహాయార్థం స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆత్మకూరులో మంగళవారం విరాళాల సేకరణకు శ్రీకారం చుట్టారు. గౌడ్ సెంటర్, పాత బస్టాండు ఏరియాల్లోని దుకాణదారుల నుంచి విరాళాలు సేకరించారు.

పంటలకు ఇన్సూరెన్స్ ప్రకటించాలి


వ్యవసాయ సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఆత్మకూరు: ఖరీఫ్, రబీ పంటల కోసం ప్రభుత్వం ఇన్సూరెన్స్‌ను ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరన్న డిమాండ్ చేశారు. స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద మంగళవారం ఆయన రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. తుపాన్ వల్ల పంటలు నష్టపోయిన ప్రతి రైతుకీ పరిహారం చెల్లించాలని, అన్నదాత సుఖీభవ పథకం కింద రైతాంగానికి రూ.20 వేలు ఇవ్వాలని, రూ.2 లక్షల వరకు పంట రుణాలను రద్దు చేయాలనే డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని వ్యవసాయ సిబ్బందికి అందించారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ


కిట్లను అందజేస్తున్న దృశ్యం

బండిఆత్మకూరు: మండల పరిధిలోని నారపరెడ్డి కుంట గిరిజన గూడెంలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌లో పౌష్టికాహారం మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, ఎంఎల్ హెచ్‌పీ స్వర్ణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్త రేష్మ తదితరులు పాల్గొన్నారు.

వరద సహాయక చర్యల్లో ప్రభుత్వం విఫలం

- బాధితులకు సాయం అందించడంలోనూ నిర్లక్ష్యం
- మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి


మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: వరద సహాయక చర్యల్లో చంద్రబాబు సర్కారు ఘోరంగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి విమర్శించారు. విజయవాడ వరద నీటిలో మునిగిపోవడానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరద ముంచెత్తి సుమారు వారం రోజులవుతున్నా బాధితులను పూర్తిస్థాయిలో ఆదుకున్న దాఖలాలు లేవన్నారు. ఇప్పటికీ చాలా మంది బిక్కుబిక్కు మంటూ వరద నీటిలోనే కాలం వెళ్లదీస్తున్నారన్నారు. సహాయక చర్యలు చేపట్టడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందన్నారు. బాధితులకు కనీసం ఆహారం, తాగునీరు కూడా అందించకపోతే ఎలా అని ప్రశ్నించారు. చంద్రబాబు ఇంటికి మూడు కి.మీ దూరంలోనే ఈ విపత్తు వచ్చిందన్నారు. రాష్ట్రానికి భారీ తుపాను ఉందని వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలు జారీచేసినా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. దీంతో విజయవాడ ప్రజలు వరదనీటిలో చిక్కుకొని అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వరదల సందర్భంగా జరిగిన ప్రాణ, ఆస్తి నష్టానికి చంద్రబాబే కారణమన్నారు. బుడమేరు ఆధునీకరణ పనులు చేపడితే టీడీపీ నేతలకు చెందిన భూములు పోతాయనే భూసేకరణ చేపట్టలేదన్నారు. చంద్రబాబు నివాసంతో పాటు ఏబీఎన్ రాధాకృష్ణకు చెందిన పవర్ ప్రాజెక్ట్‌కి నష్టం జరుగుతుందనే ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా అర్ధరాత్రి జనం మీదకు నీటిని వదిలారని ఆరోపించారు. ఈ విషయాన్ని కప్పిపుచ్చి మాయ మాటలు చెబుతున్నారన్నారు. పబ్లిసిటీ పిచ్చితో రోజూ కెమెరాలు, అధికారులను వెంటేసుకుని తిరగటం వంటి వల్లే సహాయక చర్యలు పూర్తిస్థాయిలో జరగటం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వరద బాధితులను ఆదుకోవాలన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు అక్కడే ఉండి వరద బాధితులకు సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు.

రైతన్నపై వరుణుడి కన్నెర్ర

- అధికవర్షాలతో రైతులు అతలాకుతలం
- ఆత్మకూరు డివిజన్‌లో అత్యధిక పంట నష్టం

రైతన్నపై వరుణుడు కన్నెర్ర చేశాడు. ముందస్తు పంటలు సాగు చేశామని సంబర పడిన రైతులను వరుణుడు నిలువునా ముంచాడు. ఎడతెరిపినివ్వకుండా కురిసిన వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. విత్తు వేసినప్పటి నుంచి కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన పైర్లు వర్షార్పణం కావడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని ఆశగా ఎదురుచూస్తున్నారు. – ఆత్మకూరు


ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న పంట

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంలో ఆత్మకూరు డివిజన్‌లో రికార్డుస్థాయిలో వర్షాలు కురిశాయి. సుద్దవాగు, గుండ్లకమ్మ, బవనాసి వాగులు పొంగి ప్రవహించడంతోపాటు వరదరాజుస్వామి ప్రాజెక్టు కూడా నిండడం, సిద్దాపురం చెరువు అలుగు ఎక్కి పారడంతో రైతులు సాగుచేసిన పంట పొలాలు నీట మునిగాయి. ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు మండలాల్లో మొక్కజొన్న, మినుము, కంది, మిర్చి పంటలు భారీగా దెబ్బతిన్నాయి. జిల్లా కలెక్టర్ రాజకుమారి సైతం ఆత్మకూరు మండలంలో పర్యటించి పరిస్థితిని తెలుసుకున్నారు. వ్యవసాయ అధికారుల పరిశీలనలో కూడా జిల్లాలోనే అత్యధికంగా ఆత్మకూరు డివిజన్‌లోనే పంటలు దెబ్బతిన్నట్లు తేలింది. జిల్లాలో దాదాపు 6 వేల హెక్టార్లలో పంటలకు నష్టం వాటిళ్లగా అందులో ఆత్మకూరు డివిజన్‌లోనే 5 వేల ఎకరాలకు పైగా పంట నష్టం వాటిల్లింది. ఆత్మకూరు మండలంలో 2,919 ఎకరాలలో మొక్కజొన్న, పాములపాడు మండలంలో 3,750 ఎకరాలు, కొత్తపల్లి మండలంలో 7,220 ఎకరాలలో మొక్కజొన్న, మినుము, పత్తి, మిర్చి, కంది పంటలు దెబ్బతిన్నాయని వ్యవసాయ అధికారులు జిల్లా అధికారులకు నివేదించినట్లు సమాచారం. ఈ లెక్కన డివిజన్‌లో దాదాపు 13,975 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది.


నీట మునిగిని మొక్కజొన్న పంటను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్న రైతులు

రికార్డు స్థాయిలో వర్షాలు

సెప్టెంబర్ నెలలో సాధారణంగా ఆత్మకూరు మండలంలో 120 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా నాలుగు రోజుల్లోనే 120 మి.మీ. వర్షం కురిసింది. ఈనెల 1న 32.2 మి.మీ., 2న 86.6 మి.మీ., 3న 32.9 మి.మీ., 4న 22.6 మి.మీ. సాధారణ వర్షపాతం కంటే రికార్డుస్థాయిలో వర్షం కురవడంతో పంటలకు తీవ్ర నష్టం చేకూరింది. మొక్కజొన్న పంటలో నడుము లోతు నీళ్లు నిలిచాయి. నీటిని మళ్లించేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే కంది, పత్తి తదితర పంటలు పూర్తిగా నష్టపోయాయి. పెట్టుబడులు దక్కాలంటే కనీసం ఎకరాకు రూ.30 వేల చొప్పున అయినా ప్రభుత్వం పరిహారం అందజేయాలని రైతులు కోరుతున్నారు.

పంట నీటిపాలైంది



ఈ యేడాది ఖరీఫ్‌లో 12 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. పంట చేతికొచ్చి లాభాలు వస్తాయని భావించాను. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు 8 ఎకరాల్లో పంట పూర్తిగా నాశనమయ్యింది. ఎకరాకు రూ.50 వేల చొప్పున రూ.4 లక్షలు దాకా నష్టపోయాను. కేవలం నాలుగు ఎకరాల్లో మాత్రమే పంట మిగిలింది. పంటలో నీరు పారడంతో భారీగా దెబ్బతింది.

– విజయ్, ఆత్మకూరు రైతు

ప్రభుత్వమే ఆదుకోవాలి



మూడు ఎకరాల్లో సాగుచేసిన మొక్కజొన్న పంట పూర్తిగా దెబ్బతింది. పంట నష్టం చెల్లించాలని వ్యవసాయ అధికారులను కోరాం. ఎకరాకు ఎంత ఇస్తారో తెలియదు. ఇప్పటికే రెండుసార్లు పంటను వేసి ధ్వంసం చేశాను. మూడోసారి వేసిన పంట వరదల దాటికి కొట్టుకుపోయింది. ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.50 వేల దాకా ఖర్చు చేశాను. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– సుబ్బన్న, కొత్త రామాపురం రైతు

జాబితా రూపొందిస్తున్నాం



భారీ వర్షాలకు ఆత్మకూరు, కొత్తపాడు, పాములపాడు, వెలుగోడు మండలాల్లో మొక్కజొన్న, కంది, మినుము, మిర్చి, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. రైతులు ఎంత మేర పంటలు నష్టపోయారన్న వివరాలను సేకరిస్తున్నాం. ఈనెల 12వ తేదీ తర్వాత జాబితాను ప్రకటిస్తాం. పేర్లు నమోదు కాని రైతులు రైతుభరోసా కేంద్రాల వద్దకు వచ్చి పేర్లను నమోదు చేసుకోవాలి.

– ఆంజనేయ, ఏడీఏ, ఆత్మకూరు

వేంపెంటలో వైద్యశిబిరం తొలగింపు

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామంలో గత నెల 29 నుంచి కొనసాగించిన వైద్యశిబిరాన్ని మంగళవారం తొలగించినట్లు డాక్టర్ నాగలక్ష్మి తెలిపారు. గ్రామంలో ఒక్క డయేరియా కేసు నమోదు కాకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వైద్యశిబిరం తొలగించామన్నారు.

పంట నమోదు తప్పనిసరి

వెలుగోడు: సాగు చేసిన ప్రతి పంటను ఈనెల 15వ తేదీలోగా వ్యవసాయ సిబ్బంది వద్ద నమోదు చేయించుకోవాలని ఏఓ పవన్ కుమార్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని రేగడగూడూరు రైతు సేవ కేంద్రంలో సిబ్బంది చేపట్టిన ఈ పంట, రైతుల ఈకేవైసీ ప్రక్రియను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాన్ని పరిశీలించారు. 52 టన్నుల యూరియా, 20 టన్నుల డీఏపీ అందుబాటులో ఉందని, అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

నల్లబ్యాడ్జీలతో వైద్యుల నిరసన

పగిడ్యాల: ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యుల అసోసియేషన్ పిలుపు మేరకు జీఓ 85ను వ్యతిరేకిస్తూ వైద్యులు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి మోహన్ మాట్లాడుతూ రెండు నెలలుగా జీఓను రద్దు చేయాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే దశలవారీగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

కొత్తపల్లి: మండలంలోని పెద్దగుమ్మడాపురం ఫీల్డ్ అసిస్టెంట్ సంపత్‌కుమార్‌పై మంగళవారం ఆత్మకూరు ఏపీడీ అన్వరాబేగం విచారణ చేపట్టారు. పనులు సరిగి కల్పించడంలేదని, గత సార్వత్రిక ఎన్నికల్లో ఓ పార్టీ ఏజెంట్‌గా ఉన్నాడని ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో విచారణ చేపట్టినట్లు ఏపీడీ తెలిపారు. నివేదికలను జిల్లా అధికారులకు అందజేస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయకుని నిమజ్జనం


తాటిపాడులో వినాయకున్ని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం


పగిడ్యాల: లక్ష్మాపురంలో నిమజ్జనానికి తరలి వెళ్తున్న వినాయకుడు

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు, జూపాడుబంగ్లా, తంగడంచ, మండ్లెం, 80 బన్నూరు, పోతులపాడు, తరిగోపుల, పి.లింగాపురం గ్రామాల్లోని వినాయకులు మంగళవారం నిమజ్జనానికి తరలివెళ్లారు. మేళతాళాలతో భాజా భజంత్రీల మధ్య వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి జూపాడుబంగ్లా కేసీ కాల్వలో నిమజ్జనం చేశారు. ఎస్ఐ లక్ష్మీనారాయణ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

పగిడ్యాల: మండలంలోని లక్ష్మాపురం, పాత ముచ్చుమర్రి, కొత్త ముచ్చుమర్రి గ్రామాల్లో మంగళవారం గణేష్ విగ్రహాల నిమజ్జన వేడుకలు అట్టహాసంగా సాగింది. ఉత్సవ కమిటీ సభ్యులు విగ్రహాలను ప్రత్యేక వాహనాలల్లో ఊరేగింపుగా తరలించారు. కులమతాలకు అతీతంగా ప్రజలు ఈ వేడుకల్లో పాల్గొని మతసామరస్యాన్ని చాటుకున్నారు. పాత, కొత్త ముచ్చుమర్రి విగ్రహాలను కేసీ కాలువలో.. లక్ష్మాపురం విగ్రహాలను పడమర ప్రాతకోట కేసీ కాలువలో నిమజ్జనం చేశారు.

వెలుగోడు: వేల్పనూరు గ్రామంలో మంగళవారం నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పురవీధుల్లో ఏడు చోట్ల ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలను డప్పు వాయిద్యాలు, నృత్యాలతో ఊరేగింపుగా గ్రామ శివారులో ఉన్న నిప్పుల వాగులో నిమజ్జనం చేశారు. ఎస్ఐ విష్ణునారాయణ ఆధ్వర్యంలో బందోబస్తు చర్యలు చేపట్టారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు


సింగరాజు పల్లె వద్ద ఆగిపోయిన ఆర్టీసీ బస్సు

కొత్తపల్లి: మండల పరిధిలోని లింగాపురం, శివపురం, సింగరాజుపల్లె, ముసలిమడుగుల మీదుగా సంగమేశ్వరం వెళ్లే ఆత్మకూరు ఆర్టీసీ డిపో బస్సు మంగళవారం సింగరాజుపల్లె గ్రామ సమీపంలో మొరాయించింది. దీంతో విద్యార్థులు, ప్రయాణికు లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాగా కాలం చెల్లిన బస్సు కావడంతో వారంలో రెండు, మూడుసార్లు మొరాయిస్తుందని, ఆర్టీసీ అధికారులు బస్సును మార్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఐలమ్మకు ఘన నివాళి


చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నాయకులు

జూపాడుబంగ్లా: చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలో ఉన్న ఐలమ్మ విగ్రహానికి సర్పంచ్ మొట్టె బాలయ్య, రజక సంక్షేమ సంఘం రాష్ట్ర మాజీ నాయకుడు బస్తిపాటి మౌలాలి, సీపీఐ నాయకుడు రమేష్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎర్రన్న తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్రం జనగామ జిల్లాలో పుట్టిన ఐలమ్మ పేరును ఆ జిల్లాకు పెట్టాలని వారు డిమాండ్ చేశారు. భూపోరాటం చేసిన వీరవనిత ఐలమ్మను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని, సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలు తొలగించాలి

కొత్తపల్లి: రహదారులు, వీధుల వెంట ఉన్న పిచ్చి మొక్కలు, మురుగు నీటిని తొలగించాలని బట్టువారిపల్లె గ్రామస్తులు కోరుతున్నారు. మెయిన్‌రోడ్డు నుంచి పాతబట్టువారి పల్లెకు వెళ్లే రహదారి, కొత్తబట్టువారిపల్లె గ్రామంలోని వీధులకు ఇరువైపులా ముళ్లపొదలు పెరగడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉందని, విషపురుగులు భయం వెంటాడుతోందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థలేక కాలనీలలోనే నీరు నిలిచి పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో వ్యాధుల బారిన పడుతున్నామని పంచాయతీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, ఉన్నతాధికారులైనా తమ సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

వీఆర్‌ఏల సంక్షేమానికి కృషి


నూతన కమిటీ సభ్యులు

నందికొట్కూరు: గ్రామ రెవెన్యూ సహాయకుల సంక్షేమానికి కృషి చేస్తానని వీఆర్‌ఏల సంఘం పట్టణ అధ్యక్షులు మహేశ్వర తెలిపారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయ ఆవరణలో వీఆర్‌ఏల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు మహేశ్వర, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, కార్యదర్శి దరగయ్య, కోశాధికారి శివన్నతోపాటు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ వీఆర్‌ఏలకు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలను సక్రమంగా అందేలా చర్యలు కృషి చేస్తామన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేయాలి


రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ప్రభుత్వం నిలిపేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు స్వాములు డిమాండ్ చేశారు. కొత్తబస్టాండు సమీపంలోని కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రైవేటీకరణతో వందలాది మంది కార్మికుల కడుపు కొట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సద్దాం, గణపతి, కరిముల్లా, చాంద్, మాబాషా, వలీ, విజయ్ పాల్గొన్నారు.

ప్రైవేటీకరిస్తే ఉద్యమిస్తాం

నందికొట్కూరు: విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తే ఉద్యమిస్తామని సీఐటీయూ జిల్లా నాయకులు గోపాలకృష్ణ, ఫక్కీర్ సాహెబ్ హెచ్చరించారు. మంగళవారం మార్కెట్ యార్డు సమీపంలోని కేజీ రోడ్డుపై కార్మికులతో కలిసి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాము, శివ, బాబు, కార్మికులు కృష్ణ, పాండు, స్వాములు, మద్దిలేటి పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటు పరం చేయటం తగదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు తెలిపారు. మంగళవారం మండ్లెం గ్రామంలో కేజీ రోడ్డుపై కాసేపు రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మధు, మగ్బుల్‌బాషా, నరేష్, సురేంద్ర పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన


నృత్య ప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై మంగళవారం వరంగల్‌కు చెందిన కృష్ణ సంగీత నృత్య పాఠశాల వారి సంప్రదాయ నృత్యం ఆకట్టుకుంది. గణపతి ప్రార్థన, శంకర శ్రీగిరినాథ ప్రభో, శివపంచాక్షరి స్తోత్రం, హిమగిరి తనయ, అఖిలాండేశ్వరి తదితర గీతాలకు, అష్టకాలకు కస్తూరి సుమన, అక్షిత, తన్మయి, తేజస్విని, భువి, నక్షత్ర, లక్ష్మీచిన్మయి, సునేత్ర, వరుణవి, సంకీర్తన తదితరులు నృత్యాలు ప్రదర్శించారు.

కోలుకోలేక మహిళ మృతి

శ్రీశైలంటెంపుల్: పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించి కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీశైలం శ్రీగిరి కాలనీకి చెందిన పి.నాగమల్లమ్మ కోలుకోలేక మంగళవారం మృతిచెందినట్లు సీఐ జి.ప్రసాదరావు తెలిపారు. మృతురాలి సోదరుడు శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగమల్లమ్మతో సహజీవనం చేస్తున్న కార్తీక్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సన్మానం


వెంకటరమణ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరు: ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు పొందిన వెంకటాపురం ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వెంకటరమణను మంగళవారం ఎంఈఓ సురేష్‌కుమార్, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అయూబ్‌అహ్మద్, ఉపాధ్యాలు నాగరాజు, శ్రీనివాసులు, జవహర్‌నాయక్, దాసు, శోభన్‌బాబునాయక్, వలీబాషా, దాదాపీరా, రాజానాయక్, కృష్ణుడు, ప్రతీష్, పుష్పలత, మంజువాణి పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించొద్దు

కొత్తపల్లి: వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లు బిగించొద్దని ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.రాజశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం నందికుంట సచివాలయం వద్ద రైతులతో కలిసి ఆందోళన చేపట్టారు. అధిక వర్షాలకు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని, అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు రూ.20 వేలు ఇవ్వాలని, ఖరీఫ్, రబీ ఇన్సూరెన్స్ ప్రకటించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సచివాలయ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వీరన్న, పాల్గొన్నారు.

మహిమాన్వితుడు మహానందీశ్వరుడు


శివకోటి పీఠం వ్యవస్థాపకులను సన్మానిస్తున్న దృశ్యం

మహానంది: మహానందిలో కొలువైన మహానందీశ్వరస్వామి, కామేశ్వరీదేవి ఎంతో మహిమాన్వితులని అనంతపురం శివకోటి పీఠం వ్యవస్థాపకులు అప్పాస్వామి తెలిపారు. అతిరుద్ర దీక్షలో భాగంగా శ్రీశైలంలో నాలుగవ మహారుద్రాన్ని పూర్తిచేసుకుని మంగళవారం మహానందికి వచ్చారు. కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం వేదపండితులు అప్పాస్వామిని ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీశైలం, నందికొట్కూరు
70750 09158
Office mail : sakshiknladvt@gmail.com